క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో పండ్ల వ్యాపారం చేసుకొంటూ జీవిస్తున్న తలారి గోవిందు (40) కాకినాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం... అప్పుల బాధ భరించలేక శుక్రవారం సాయంత్రం స్థానిక పంచరామక్షేత్రం వద్ద గడ్డి మందు తాగి స్టేషన్ సెంటర్‌లోని తన పండ్ల దుకాణం వద్దకు వచ్చాడు. అక్కడ వాంతులు చేసుకోవడంతో విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగరావు ఆటోలో కాకినాడలోని ఆస్పత్రికు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగ పండ్ల వ్యాపారి గోవిందు మృతిని పురస్కరించుకొని స్టేషన్ సెంటర్‌లోని పండ్ల వర్తకులు షాపులు మూసి వేసి సంతాపం తెలిపారు.

నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సామర్లకోట: స్థానిక అతిపూరాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుగుతాయని ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మహిళలతో భజన, పారాయణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం మధ్యాహ్నం ప్రసాద వితరణ ఉంటుందన్నారు. మంగళవారం ఉట్టు కొట్టు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఆలయ అర్చకులు అనంతపద్మనాభాచార్యులు, రవికుమార్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వేద ధర్మం పురాణం చెబుతుంది


మాట్లాడుతున్న గొట్టుముక్కుల వెంకట సత్య నరసింహ శాస్త్రి

బోట్‌క్లబ్: వేద ధర్మం పురాణం చెబుతుందని ఆస్వాదన సాహితీ సమితి వ్యవస్థాపకుడు గొట్టుముక్కల వెంకట సత్య నరసింహ శాస్త్రి అన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అష్టాదశ పురాణ పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భగవద్గీతలలో విషయాలు అమృతవాక్కులన్నారు. విష్ణు పురాణం వర్తమాన కాలంలో అనేక విశేషాలు ప్రస్ఫుటమయ్యాయనని ఆయన విశ్లేషించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త కాశీభొట్ల సత్యనారాయణ, కాకరపర్తి దుర్గాప్రసాద్, ప్రముఖ పంచాంగకర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక


శ్రీను

రౌతులపూడి: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14 జూనియర్ ఫెడరేషన్ పోటీల్లో బలరామపురం గ్రామానికి చెందిన పైల శ్రీను ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీను జిల్లా స్థాయి షార్ట్‌పుట్, జావెలిన్ త్రో పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీను ఈ నెల 25, 26 తేదీల్లో ఏలేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీను, అతని తల్లిదండ్రులను గ్రామస్తులు అభినందించారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి

గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమానాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199
కొత్తమూలపేట	9666855856
పాత, కొత్త ఇసుకపల్లి	9154403429

నిధులు ఫుల్.. సౌకర్యాలు నిల్

- నత్తనడకన రైల్వే అభివృద్ధి పనులు
- ఎంపీ గీత హయాంలో మంజూరైన నిధులు
- సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పేరుకే రైల్వే జంక్షన్.. లగేజ్ రూమ్ కూడా లేదు
- ప్లాట్‌ఫాంలను కలుపుతూ వంతెన నిర్మాణం చేయాలని డిమాండ్



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన ముఖద్వారం పనులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాకినాడ పార్లమెంటరీ సభ్యురాలు గీత సామర్లకోట రైల్వే స్టేషన్‌తోపాటు, పిఠాపురం, అన్నవరం, తుని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చారు. ఆ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు నేటికీ పూర్తి కాక పోవడంపై రైల్వే అధికారుల తీరును తప్పు పడుతున్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్ జిల్లాకు ముఖ్యకూడలి ప్రదేశం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. కాకినాడ నుంచి విశాఖపట్నం- రాజమహేంద్రం వైపు దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి తప్పని సరిగా సామర్లకోట రైల్వే స్టేషన్ నుంచి వెళ్లాలి. అంత ప్రాధాన్యం ఉన్న రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ గీత నిర్ణయించి నిధులు మంజూరు చేయించారు. రైల్వే ఉన్నతాధికారులైన జీఎం, డీఆర్ఎంలు కాకినాడతో పాటు తుని వరకూ తనిఖీలు చేసే సమయంలో సామర్లకోట మీదుగానే రాకపోకలు సాగించాలి. అయినా పనులు వేగం పుంజుకోలేదు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లు ఎదురెదురుగా ఉన్నాయి. దాంతో రైళ్లు వచ్చిన సమయం ఈ సెంటర్‌లో రోడ్డు రద్దీతో నిండిపోతుంది.


నిలిచిపోయిన షెడ్ల నిర్మాణ పనులు

ఫ్లైఓవర్ బ్రిడ్జి అవసరం

రైలు దిగి బస్సు కాంప్లెక్స్‌కు చేరే సమయంలో రోడ్డు దాటేటప్పుడు అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని రైల్వే ప్లాట్‌ఫాంలు కలుపుతూ బస్సు కాంప్లెక్స్‌లోనికి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆ విధంగా చేయడం వల్ల రిజర్వేషన్లు ఉన్న ప్రయాణికులు నేరుగా ఆయా ప్లాట్‌ఫాంలకు చేరుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ప్రయాణికులు బస్సుల కోసం ఇతరులను అడిగే పని ఉండదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్లాటుఫాంలను కలుపుతూ రైల్వే జంక్షన్‌లో కేవలం ఒక కాలిబాట వంతెన మాత్రమే ఉంది. గత కొన్ని ఏళ్లుగా మరో వంతెన నిర్మాణం చేస్తామని రైల్వే అధికారులు ప్రయాణికులను ఊరిస్తున్నారే తప్ప పనులు మాత్రం చేయడంలేదు. ఉన్న కాలిబాట వంతెన వద్దకు వెళ్లలేని అనేక మంది ప్రయాణికులు పట్టాలు దాటి రాకపోకలు సాగిస్తున్నారు.

కానరాని సామాన్లు భద్రపర్చే రూమ్

సామర్లకోట రైల్వే జంక్షన్ పేరుకే ఉందని ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో ఏ మాత్రం ముందు చూపు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. రైల్వే స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు స్థానిక పంచారామ క్షేత్రంతో పాటు ద్రాక్షారామం, పిఠాపురం పాదగయలను దర్శించుకోవడానికి అనేక మంది వస్తూ ఉంటారు. అటువంటి ప్రయాణికులు తమ తమ సామాన్లు భద్ర పర్చుకోవడానికి రూములు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సామాన్లు భద్రపర్చుకోవడానికి లాడ్జిలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ఎదురు ఎదురుగా ఉండడంతో దొంగతనాల జోరు కూడా ఎక్కువగా ఉంటుంది. దొంగలను గుర్తించడంతో పాటు అనుమానితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది కానీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

వంతెన నిర్మించాలి



రైల్వే ప్లాట్‌ఫాంలను కలుపుతూ రైల్వే స్టేషన్ బయటకు వంతెన నిర్మాణం చేయాలి. దాంతో రద్దీ తగ్గి ప్రమాదాలు తగ్గుతాయి. ఒక కాలిబాట వంతెనతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సామాన్లు భద్రపర్చే గదిని వెంటనే ఏర్పాటు చేయాలి. వీటిపై డీఆర్ఎంకు వినతి పత్రాలు అందజేస్తాం.

– నూతలపాటి అప్పలకొండ, జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు, సామర్లకోట

త్వరలో పనులు పూర్తి చేస్తాం



రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై సామాన్లు భద్రపర్చు రూమ్ ఏర్పాటు చేస్తాం. ఈ మేరకు కాంట్రాక్టరు కోసం టెండర్లు పిలుస్తాం. రైల్వే ప్లాటు ఫారం నుంచి బస్సు కాంప్లెక్స్ వరకు వంతె నిర్మాణం చేయడానికి రైల్వే అనుమతించదు. రెండో కాలిబాట వంతెన, ఎక్సలేటర్ నిర్మాణానికి అనుమతులు లభించాయి. తుని, అనకాపల్లి రైల్వేస్టేషన్ పనులు ముందుగా పూర్తి చేయాల్సి ఉంది. ఈ కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. త్వరలో పనులు పూర్తి చేస్తాం. పాత కాలిబాట వంతెన స్తంభాల తొలగింపు పనులు రెండు నెలలు అయినా పూర్తి కాకపోవడంతో రెండు, మూడు ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

– ఎం.రమేష్, రైల్వే స్టేషన్ మేనేజరు సామర్లకోట

ఘనంగా కాగితమ్మ జాతర


అమ్మవారి గ్రామోత్సవంలో గరగ నృత్యాలు

తొండంగి: మండలంలోని బెండపూడి గ్రామదేవత కాగితమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి పసుపు నీటి బిందెలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామశివారులో కాగితమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకాలు చేశారు.

అలరించిన ఘంటసాల బయోపిక్


ఘంటసాల బయోపిక్ దర్శక నిర్మాత చిత్తజల్లు రామారావును సత్కరిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

బోట్‌క్లబ్: ఘంటసాల బయోపిక్ కాకినాడ ప్రేక్షకులను అలరించింది. స్థానిక పద్మప్రియ థియేటర్‌లో గానగంధర్వ ఘంటసాల బయోపిక్ చిత్రం ప్రివ్యూ షో ఆదివారం ప్రదర్శించారు. వేలాది సినిమా పాటలు, భగవద్గీత వంటి భక్తిగీతాలను అశేషంగా ఆలపించి తెలుగువారి గుండెల్లో స్థానం సంపాదించుకున్న అమర గాయకుడు ఘంటసాల బయోపిక్ చాలా బాగుందని నగర ప్రజలు మైమరచిపోయారు. ఘంటసాల పాత్రలో ప్రముఖ గాయకుడు కృష్ణచైతన్య నటించారు. బయోపిక్ తీసిన దర్శక నిర్మాత చిత్తజల్లు రామారావు పద్మప్రియ థియేటర్‌లో ప్రివ్యూ షో తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల జీవితాన్ని బయోపిక్‌గా తీసి, తెలుగు ప్రేక్షకులకు కానుకగా అందజేయాలన్న చిరకాల కోరిక తీరిందన్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత రామారావును సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి అభినందించారు.

ప్రభుత్వాలు మారినా కార్మికుల బతుకులు మారవే

- డిసెంబర్ 31 నుంచి సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలు
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నూతన రాష్ట్ర అధ్యక్షుడు కొండలరావు

సామర్లకోట: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప కార్మికుల బతుకులు మారడం లేదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో సామర్లకోట, అమలాపురం ఏపీ బేవరేజెస్ డిపో కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హమాలిస్ 5వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి లయన్స్ క్లబ్ భవనం వద్ద సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రంలో 6.50 లక్షల మంది కార్మికులు ప్రైవేటు, ప్రభుత్వ గోడౌన్లలో కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. కార్మికుల శ్రమ ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఆదాయం చేకూరుతుందని చెప్పారు. అటువంటి కార్మికుల భవిష్యత్తు కోసం బడ్జెట్‌ల్లో నిధులు కేటాయింపు ఉండకపోవడం దారుణమన్నారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగినా పట్టించుకునే నాథులే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పని గంటలు, సెలవులు కూడా లేని పరిస్థితులలో హమాలీ కార్మికులు జీవిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులందరూ ఐక్యతతో ఉద్యమిస్తే రాష్ట్రంలో దారుణనమైన పరిస్థితల నుంచి మార్పులు తెచ్చుకోవచ్చన్నారు. ప్రభుత్వాలు తక్షణమే బడ్జెట్‌ల్లో కార్మికుల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని, పని గంటల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డిసెంబరు నుంచి ఆల్ ఇండియా సీఐటీయూ మహాసభలు

డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో సీఐటీయూ ఆల్ ఇండియా మహా సభలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు సీఐటీయూ నాయకుడు, ఏపీ బేవరేజెస్ హమాలిస్ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు తెలిపారు. హమాలిస్ 5వ రాష్ట్ర మహాసభ సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ మహాసభలకు హమాలిస్ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఆదివారం జరిగిన మహా సభకు రాష్ట్రంలోని 17 డిపోల నుంచి 150 మంది హమాలిస్ కార్మికులు హాజరైనట్టు కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శేషుబాబ్జి, హమాలీ రాష్ట్ర ప్రదాని క్యాడ్ ఎం.మదన్‌మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, రామారావు, సామర్లకోట అధ్యక్ష, కార్యదర్శులు వి.అప్పలరాజు, ఎం.సోమేశ్, అమలాపురం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రామారావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

హమాలిస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొండలరావు

రాష్ట్ర మహాసభ సందర్భంగా ఏపీ బేవరేజెస్ హమాలిస్ రాష్ట్ర యూనియన్ ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా విప్పర్తి కొండలరావు, కార్యదర్శిగా ఎం.మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడిగా కె.ఉమా మహేశ్వరరావు, కోశాధికారిగా బత్తుల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎస్‌వీ సుబ్బు రెడ్డి, ఎస్.ప్రసాద్‌రావు, రామారావు, మూర్తి, రాయుడు మల్లికార్జున్, సాంబయ్యలు ఎన్నికయ్యారు.

రైల్వే ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు


సామర్లకోటలో రైల్వే ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేసిన రైల్వే అధికారులు

సామర్లకోట: ప్రతి ఏడాది రైల్వే ఉమ్మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు, కార్మికుల పిల్లలకు నిర్వహిస్తున్న వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో భాగంగా ఆదివారం స్థానిక రైల్వే కల్యాణ మండపంలో వ్యాస రచన పోటీలను ప్రారంభించారు. విద్యార్థులను ఆరు ఏళ్ల నుంచి 9 సంవత్సరాల వరకూ, పదేళ్ల నుంచి 12 ఏళ్ల వరకూ, 13ఏళ్ల నుంచి 15ఏళ్ల వరకు మూడు కేటగిరిలుగా విభజించి పోటీలు నిర్వహించినట్టు రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. ఈ వ్యాసరచన పోటీల్లో 32 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఆదివారం పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు, బహుమతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 21వ తేదీన డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. సబ్జెక్టును అప్పటికి అప్పుడు ఎంపిక చేసి ఇస్తామని తెలిపారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న వారికి పేపర్లను విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయానికి పంపిస్తామని, అక్కడ న్యాయ నిర్ణేత సమక్షంలో డివిజన్ వ్యాప్తంగా జరిగిన పేపర్లు పరిశీలించి ప్రతి రైల్వే స్టేషన్ నుంచి ఆయా కేటగిరిలల్లో ముగ్గురిని ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అక్టోబరు 2న విజయవాడలో అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఈఎన్ బి.శివప్రసాద్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టరు టి.సాంబ శివరావు, రైల్వే సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు, హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి పాల్గొన్నారు.

జోరుగా అన్నదాన కార్యక్రమాలు

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలో అన్నదాన కార్యక్రమాలు ఆదివారం జోరుగా జరిగాయి. గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని ఆయా గణపతి శిబిరాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక రైల్వే క్వార్టర్సులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ప్రారంభించారు. రైల్వే ప్రయాణికులు, ఉద్యోగులు, క్వార్టర్సు వాసులు అన్నప్రసాదాలను స్వీకరించారు. స్థానిక 31వ వార్డు భాస్కర్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ బీసీ సంఘ పట్టణ అధ్యక్షుడు వేగి సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేసిన్నట్టు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా బడేలమ్మ చెరువు వద్ద ప్రసన్నాంజనేయనగర్‌లో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, నిర్వాహకులు పాల్గొన్నారు. మూడు వేల మంది అన్నప్రసాదం స్వీకరించిన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు వ్యాన్ స్టాండ్‌లో అన్నదానం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఉన్న వ్యాన్ స్టాండ్‌లో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

- సీఐ శ్రీనివాస్
- చెందుర్తిలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్


చెందుర్తిలో గ్రామస్తులకు సూచనలు ఇస్తున్న పోలీసులు

పిఠాపురం: గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ గ్రామస్తులకు సూచించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఆదివారం తెల్లవారుజాము నుంచి నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో గ్రామంలో 2 కార్లు, 1 ఆటో 48 బైకులు ఎటువంటి డాక్యుమెంట్ లేని వాహనాలను సీజ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఇళ్లు, అనుమానితులను, ద్విచక్రకారులను ఆటోలను తనిఖీ చేసి డాక్యుమెంట్ లేని వాహనాలను సీజ్ చేశామన్నారు. తనిఖీల్లో భాగంగా ఊర్లో కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే వారి వివరాలను పూర్తిగా తనిఖీ చేశామన్నారు. ప్రజలు కూడా తమ గ్రామంలోకి ఎవరు కొత్తగా వచ్చినా వాళ్లు ఎవరనేది ఆరా తీసి అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా నేరాలకు అవకాశం లేకుండా సహకరించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో నరేంద్రగిరికి మార్గం


ప్రత్తిపాడు నరేంద్రగిరి శ్రమదానంలో పాల్గొన్న పెద్దాపురం క్రైమ్ సీఐ అంకబాబు తదితరులు

ప్రత్తిపాడు: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన స్వామి వివేకానంద విగ్రహం ఉన్న ప్రత్తిపాడు నరేంద్రగిరి మెట్ల మార్గం శ్రమదానంతో తిరిగి ఏర్పడింది. స్థానిక జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న నరేంద్రగిరికి పర్యాటకులు వస్తారు. కొండ దిగువ నుంచి పైకి మెట్ల మార్గం ఉన్నా నిర్వహణ లేక తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో మెట్ల మార్గం కనుమరుగైంది. ఇటీవల నరేంద్రగిరికి వచ్చిన పెద్దాపురం క్రైమ్ సీఐ ఎల్.అంకబాబు మెట్ల మార్గం మూసుకుపోయి ఉండడాన్ని గమనించి, శ్రమదానంతో మార్గం పునరుద్ధరించాలని సూచించారు. ఈ మేరకు నరేంద్రగిరి అభివృద్ధి కమిటీ ఆదివారం శ్రమదానం చేపట్టి, మెట్ల మార్గం సుగమం చేశారు. శ్రమదానంలో పాల్గొన్న వారికి క్రైమ్ సీఐ అంకబాబు భరతమాత చిత్రపటాలను అందజేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న కర్నాకుల, ప్రజాసంఘాల నేతలు

గోకవరం: బంగాళాపేటకు చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన దోషులను తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. బంగాళాపేటలోని బాధిత కుటుంబాన్ని ఆదివారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు ఉన్నారని వారిని కూడా అదుపులోకి తీసుకోవాలన్నారు. ఒక దళిత బాలికపై అత్యాచారం జరిగి ఆరు రోజుల అవుతున్నా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా, పలు కార్యక్రమాలకు హాజరు కావడం చాలా దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, వెనకబడిన వర్గాలపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించని తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. బాధితురాలికి రూ.25 లక్షల నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, పంట భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఎస్పీ స్పందించి ఈ దుర్మార్గానికి మద్దతుగా నిలిచిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్త్రీ విముక్తి జిల్లా నాయకురాలు సంగీత, రత్నం, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభన రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


మరిడమ్మను దర్శించుకున్న తుని భవానీలకు అమ్మవారి ఫొటో అందజేస్తున్న ఈఓ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ప్రతి వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఈ ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ మళ్లీ దాతల సహకారంతో ఈ వారం నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా తునికి చెందిన భవాని భక్తులు అమ్మవారిని దర్శించుకోగా వారికి ఈఓ మరిడమ్మ అమ్మవారి ఫొటోలను అందజేశారు.